క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మఠంపల్లి : మఠంపల్లి సమీపంలో గల తెలంగాణ మోడల్ స్కూల్‌లో పీజీటీ, టీజీటీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరీబాయి ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. పీజీటీ పోస్టులు గణితం- 2, కామర్స్-1 బోధించుటకు పీజీతో పాటు బీఈడీ చేసి ఉండాలని, టీజీటీ తెలుగు- 1, హిందీ- 1 పోస్టులకు డిగ్రీతో పాటు బీఈడీ అర్హత గల వారు ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. పై అర్హతలు గలవారిని డెమో ప్రాతిప్రదికన ఎంపిక చేయనున్నట్లు వివరాలకు సెల్ 9666684255, 7989504576 లలో సంప్రదించాలన్నారు.

కులవృత్తిదారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

హుజూర్‌నగర్‌రూరల్ : కులవృత్తిదారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. వివిధ కులాల వారికి రాష్ట్ర ప్రభుత్వం అందించే లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ కార్డు, తెల్ల రేషన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ జీరాక్స్, పాస్ ఫొటోలతో మీసేవా కేంద్రంలో బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఉత్తమ సేవలకు పురస్కారం


కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కుక్కడపు గురువయ్య

గరిడేపల్లి : మీ సేవా ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ప్రభుత్వానికి అధిక లావాదేవీలు నిర్వహించిన మండల కేంద్రంలోని మీసేవ కేంద్రం నిర్వాహకుడు, తాళ్ల మల్కాపురం గ్రామానికి చెందిన కుక్కడపు గురువయ్యకు విశేష పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ చేతుల మీదుగా ఆయన ప్రశంసపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గురువయ్యను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు.

పేద కుటుంబానికి 'ఓజో' చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న కుక్కల వెంకన్న, ఓజో ఫౌండేషన్ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరం గ్రామానికి చెందిన పొట్టిపంగు సైదమ్మ అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతి చెందింది. నిరుపేద అయిన సైదమ్మ కుమారుడు పున్నయ్యకు మంగళవారం ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు ఆదేశాల మేరకు ఆ ఫౌండేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కల వెంకన్న రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఆ పౌండేషన్ సభ్యులు బొమ్మకంటి సైదులు, పిల్లుట్ల సాయిబాబా, చల్లా సైదులు, గోపి, శ్రీను, ప్రేమ్‌కుమార్, వీరయ్య, శ్రీకాంత్, బాధిత కుటుంబసభ్యులు, గ్రామపెద్దలు ఉన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ


జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చిలుకూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు మంగళవారం సబ్సిడీపై జీలుగ విత్తనాలను సంఘం చైర్మన్ అలసకాని జనార్దన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బెల్లంకొండ రమణనాగయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, సీఈఓ లక్ష్మీనారాయణ, ఏఈఓలు శిరీష, చంద్రశేఖర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోతుల పట్టివేత.. అడవికి తరలింపు

అర్వపల్లి : అర్వపల్లిలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కోతులు పట్టించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వీరప్రసాద్‌యాదవ్ మాట్లాడారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కోతులను పట్టించి అడవికి తరలించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరబోయిన సునీతరామలింగయ్య, ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, కార్యదర్శి మాగి నాగయ్య, డాక్టర్ కిరణ్, మామిడాల రాజలింగం, బైరబోయిన భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

మేతకొస్తూ.. మృత్యు ఒడికి చేరుతూ

- గేదెలను మేతకోసం పొలాల్లోకి వదులుతున్న రైతులు
- హైవేపై తిరుగుతూ ప్రమాదాల బారిన పడుతున్న గేదెలు
- 45 రోజుల వ్యవధిలోనే 40కి పైగా మృతి


చిలుకూరులో కోదాడ- జడ్చర్ల హైవేపైకి వచ్చిన గేదెలు


కోదాడ- జడ్చర్ల హైవేపై ప్రమాదానికి గురై మృతి చెందిన గేదెలు

చిలుకూరు : రైతులు మేత కోసం గేదెలను పొలాలకు వదిలిపెడుతుండటంతో రోడ్డు ప్రమాదాలకు గురై అవి మృతి చెందుతున్నాయి. ఈ ఏడాది రబీ సీజన్ పంటలు పూర్తయిన తరువాత రైతులు తమ గేదెలను ఏప్రిల్ చివరి వారం నుంచి ఇప్పటివరకు సుమారుగా 45 రోజులుగా మేత కోసం పొలాలకు వదిలిపెడుతున్నారు. ఈ క్రమంలో పశువులు మేత కోసం పొలాలకు వెళ్లేటప్పుడు తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు కోదాడ- జడ్చర్ల నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడుతున్నాయి. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. రోడ్డు విశాలంగా ఉండి వాహనాలు అతివేగంగా వస్తుండడంతో ఢీకొని గేదెలు అక్కడిక్కడే మృతి చెందుతున్నాయి. దీంతో చిలుకూరులో హైవే రోడ్డు పక్కన మృతి చెందిన పశువుల కళేభరాలు దర్శనమిస్తున్నాయి. కళేభరాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

40 గేదెల పైనే మృతి..

కోదాడ- జడ్చర్ల నేషనల్ హైవేపై గత 45 రోజుల వ్యవధిలో సుమారుగా 30 మంది రైతులకు చెందిన 40 గేదెలకు పైగా మృతి చెందాయి. కొన్ని గేదెల మృతదేహాలు రోడ్డు పక్కనే దిక్కులేకుండా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం ఒక్కో పాడి గేదె రూ.40 వేల నుంచి రూ.50 వేలకు వరకు ఉంటుంది. దీంతో రైతులు ఆర్థికంగా చాలా నష్టపోతున్నారు. నేషనల్ హైవే ఏర్పాటు చేసిన తరువాత గ్రామాల్లో డివైడర్లు ఏర్పాటు చేయడంతో పశువులు ఇళ్లకు కూడా సక్రమంగా వెళ్లలేకపోతున్నాయి. రాత్రి సమయంలో పశువులు రోడ్డుపై తిరుగుతుడటంతో వాహనలు వేగంగా ఢీకొడుతుండడంతో అక్కడిక్కడే మృతి చెందుతున్నాయి. అంతేగాక గేదెలు రోడ్డు పైకి రావడంతో ద్విచక్ర వాహనాదారులు, కార్లు వారు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో రోడ్డుపై గేదెలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.

మేతకు వదలొద్దు



పశువులను మేత కోసం పొలాల్లోకి వదిలి పెట్టవద్దు. మేతకు వదిలితే పశువులు రోడ్డు ప్రమాదాలకు గురై మృతి చెందుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారుగా 40 పశువులు మృతి చెందినట్లు మా దృష్టికి వచ్చింది. అంతేగాక పొలాలకు వెళ్లిన పశువులు విద్యుదాఘాతంతో కూడా మృతి చెందుతున్నాయి. పశువులను ఇంటి వద్దే కట్టేసి మేత వేసుకుని మేపుకోవాలి.

– వీరారెడ్డి, పశువైద్యాధికారి, చిలుకూరు

సంక్షేమ పథకాల పితామహుడు కేసీఆర్

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : సంక్షేమ పథకాల పితామహుడు సీఎం కేసీఆర్ అని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మంగళవారం కోదాడలోని బీఆర్‌ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మోతె మండలానికి చెందిన అంకిరెడ్డి శ్రీనివాస్, గోగుల వెంకన్నలతో పాటు పలువురిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి భాస్కర్‌రావు, వీరశేఖర్ తదితరులు ఉన్నారు.

పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : అందరం కలిసి అభివృద్ధిని సాధిస్తూ ప్రగతి పథంలో నడుద్దామని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గరిడేపల్లి మండలం వెలిదండలో వివిధ పార్టీలకు చెందిన బుడిగె జంగల కుటుంబాల వారు మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ కోటయ్య, ఎంపీటీసీ విజయ రవి, నాయకులు పార్థసారథి, వీరస్వామి, బాలకృష్ణ, రేణుక, అనిల్, రవి, వెంకటేశ్వర్లు, రామచంద్రు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి


రైతులకు రుణాల చెక్కులు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ఆవుల రామారావు

కోదాడఅర్బన్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అందజేసే రుణాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల రామారావు అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం కోదాడ పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు గేదెలు, గొర్రెల కొనుగోలుకు రాయితీపై దీర్ఘకాలిక రుణాలు రూ. 52 లక్షలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పట్ల ప్రేమతో పీఏసీఎస్‌లు అడిగిన వెంటనే కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కోదాడ పీఏసీఎస్ పరిధిలో రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్ గుండపనేని ప్రభాకర్‌రావు, ఆడిటర్ ఆఫీసర్ రవి, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెదవీడులో వైద్య శిబిరం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ బీబీకుతుబ్

మఠంపల్లి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పెదవీడులో స్థానిక సాగర్ సిమెంట్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేషంగా స్పందన లభించింది. ఈ శిబిరాన్ని సర్పంచ్ బీబీకుతుబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్‌కుతుబ్, పరిశ్రమ పర్సనల్ మేనేజర్ తూడి వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, వైద్యులు, పరిశ్రమ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కవిత

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండలో దళిత బంధు పంపిణీ విషయంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆయన అనుచరులు నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుడిబండలో దళిత బంధు లబ్ధిదారులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లబ్ధిదారుల్లో కొంత మందికి డబ్బులు ఇచ్చి వారితో తమకు దళిత బంధు ఇచ్చేందుకు ఎంపీపీ అనుచరులు డబ్బులు తీసుకున్నారని చెప్పించారని ఆమె అన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పీసీసీ పదవి పోయి రేవంత్‌రెడ్డికి వచ్చిన తర్వాత ఆయన మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇళ్లల్లో భారీ స్కాం చేసింది నిజం కాదా అని ఆమె ప్రశ్నించారు. రాజకీయంగా ఎవరైన ఎదిగితే ఉత్తమ్ ఓర్వలేరని, సొంత పార్టీలోనే అలాంటి పరిస్థితి ఉందని అన్నారు. మండలంలో రాజకీయంగా ఎదుగుతున్న తనను, బీసీ ఎమ్మెల్యేను ఎదుర్కొలేక ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. గ్రామంలో కోట్ల రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పారు. ఇంటి స్థలాలు ఇప్పిస్తామని, బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తామని స్థానిక నాయకుడు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓ సామాజిక వర్గం ప్రజల వద్ద డబ్బులు తీసుకుంది వాస్తవం కాదా అని ఆమె ప్రశ్నించారు. ఆయనకు ఆరోగ్యం బాగోలేకపోతే సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించింది నేనే కాదా అని అన్నారు. పలువురు దళిత బంధు లబ్ధిదారులు మాట్లాడుతూ తాము ఎవరికి డబ్బులు ఇవ్వలేదని, అగ్రిమెంటులు చేసుకున్నది ఓ కుటుంబంలోని అన్నదమ్ముల మధ్య అని తెలిపారు. కార్యక్రమంలో భిక్షం, నాగయ్య, అంబేద్కర్, బాబు, పుల్లారావు, ఉపేందర్, తిరపతి తదితరులు ఉన్నారు.

సాగునీటి సంబరాలను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించే సాగునీటి సంబరాలను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ కాకతీయ సంబరాలలో భాగంగా పట్టణ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద సెంటర్ నుంచి ఊరచెరువు (మినీ ట్యాంక్ బండ్) వరకు ఎడ్ల బండ్ల ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గెల్లి రవి, అమర్‌గౌడ్, కెల్‌ఎన్‌రెడ్డి, డి.పద్మ, దీప శ్రీనివాస్‌గౌడ్ మహిళలు పాల్గొన్నారు.

ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి సాగునీరు అందించాలి


మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : రాష్ట్రంలో ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి సాగునీరు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు అవుతున్నప్పటికీ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా లక్ష రూపాయల రుణ మాఫీకి తక్షణమే అమలు చేయాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా సమితి నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, యడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య తదితరులున్నారు.

సమస్త జీవకోటికి చెట్లే ప్రాణాధారం


మొక్కలు నాటుతున్న డెక్కన్ పరిశ్రమ ఉద్యోగులు, సిబ్బంది

పాలకవీడు : సమస్త జీవకోటికి చెట్లే ప్రాణాధారం అని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉద్యోగులు, సిబ్బందితో కలిసి పరిశ్రమ భూముల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో డెక్కన్ పరిశ్రమ ప్రతినిధులు పీఎస్.రావు, ఎండీ.మస్తాన్, పి.నరసింహారెడ్డి, ఎస్ఎస్ ప్రవీణ్‌కుమార్, వీఎల్.నరసింహారావు, జగన్‌మోహన్‌రావు, కృష్ణంరాజు, రమణ, వెంకటేశ్వర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఘన స్వాగతం


ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న బీఎస్పీ నాయకులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని నేరేడుచర్లకు వెళుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూలమాలలతో సన్మానించారు. స్థానిక సమస్యలను ఆర్‌ఎస్‌పీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డాక్టర్ సాంభశివగౌడ్, భీమయ్యగౌడ్, మల్లేష్‌యాదవ్, చడపంగు రవి, నవీన్, మంద రవి, నర్సింహారావు, సుబ్బగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

11న వలిగొండలో ఎంఎస్‌పీ మహాసభ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

కోదాడఅర్బన్ : ఎస్సీ వర్గీకరణ సాధనకై ఈ నెల 11న వలిగొండలో ఉమ్మడి నల్లగొండ జిల్లా మహా సభను నిర్వహించనున్నట్లు, ఈ మహాసభకు మాదిగలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న, సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద వారు నాయకులతో కలిసి మహాసభ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఏపూరి రాజు మాదిగ, రాము మాదిగ, అంజయ్య మాదిగ, శ్రీనుమాదిగ, కుటుంబరావు, వెంకటి, జీనకకుమార్, శ్రీనివాస్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మేజర్ కాలువ వంతెన


రామాపురంలో ప్రమాదకరంగా ఉన్న వంతెన

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం గ్రామంలో నుంచి వెళ్లే కొమరబండ మేజర్ కాల్వపై వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ పూర్తిగా దెబ్బతిన్నది. వంతెన కూడా ఇరుకుగా మారింది. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు కూడా పంపారు. అయినా ఏడాది కాలంగా వంతెన పనులు ప్రారంభించలేదు. రాత్రి సమయంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలు, సింధూరంతో అభిషేకాలు గావించారు. అనంతరం స్వామివారికి ఆకుపూజ, పుష్పాలంకరణ చేసి మహార్నివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జూకూరి అంజయ్య, తిరపతయ్య, దేవరశెట్టి హనుమంతరావు, వెంపటి నర్సింహారావు, శశికుమారి, వంగవీటి రాజ్యలక్ష్మి, వీరేపల్లి రామారావు, ఓరుగంటి కిట్టు తదితరులు పాల్గొన్నారు.

కాలువ అధ్వానం.. దోమలు స్వైరవిహారం


చెట్లు, చెత్తచెదారంతో ఎస్సెస్పీ కాలువ

చిలుకూరు : మండల కేంద్రంలోని రెండవ వార్డులో గల ఎస్సెస్పీ కాలువ అధ్వానంగా తయారైంది. ఇళ్ల మధ్య నుంచి గ్రామ శివారులోని కాలువ మీదుగా నారాయణపురం చెరువులోకి వెళ్లే ఈ కాలువ అపరిశుభ్రంగా మారింది. కాలువలో పెద్ద ఎత్తున చెట్లు పెరిగి, చెత్తచెదారం పేరుకుపోయింది. దీంతో దోమలు స్వైర విహారం చేస్తుండటంతో రోగాల బారిన పడుతున్నామని ఆ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు సీసీ లైనింగ్ వేసి శుభ్రపరచాలని పలుమార్లు అధికారులకు, గ్రామ పంచాయతీ పాలకవర్గానికి విన్నవించినా వారి ను ంచి ఎలాంటి స్పందన లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షాలు కురవకముందే కాలువకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

'బడిబాట'లో ఉపాధ్యాయులు


చిలుకూరు : ఆచార్యులగూడెంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


నడిగూడెం : చెన్నకేశ్వాపురంలో..


పాలకవీడులో..

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడీడు పిల్లలను బడికి పంపాలని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసుతులు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురగాని లింగయ్య, ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లు, రాజ్యం, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడికి పంపాలి

నడిగూడెం : బడి ఈడు పిల్లలను బడికి పంపాలని సర్పంచ్ కలకొండ పుల్లమ్మ కోరారు. మంగళవారం మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దాసరాజు సురేష్, ఉపాధ్యాయురాలు మారోజు శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడులో బడిబాట ర్యాలీ

పాలకవీడు : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మాటల ప్రభుత్వం.. చేతల ప్రభుత్వం కాదు

చివ్వెంల : బీఆర్‌ఎస్ మాటల ప్రభుత్వం తప్పా చేతల ప్రభుత్వం కాదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫసల్ బీమా పథకం రాష్ట్రంలో అమలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంట నష్టం జరిగితే పదివేల రూపాయలు ఇస్తామన్న సీఎం ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పేరాల లక్ష్మణ్‌రావు, ధరావతు శ్రీనివాస్ నాయక్, కొణతం అప్పిరెడ్డి, జంపాల వెంకటేశ్వర్లు, బిట్టు నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం


రామచంద్రాపురంలో కూలిన విద్యుత్ స్తంభం

మఠంపల్లి : మండలంలోని రామచంద్రాపురంతండా, బీమ్లాతండా, బోజ్యాతండాల పరిధిలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలులు, అకాల వర్షంతో చెట్లు కూలి, ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. రామచంద్రాపురంతండాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోవడంతో ప్రజలు భయందోళన చెందారు. బీమ్లాతండాలో మూడు ఇళ్లపై రేకులు గాలికి లేచిపోయాయి. కరెంట్ లేక ఆయా గ్రామాల ప్రజలు రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. ప్రజ్రాతినిధులు, నాయకులు, ట్రాన్స్‌కో అధికారులు కరెంట్ పునరుద్ధరించడం వంటి చర్యలు చేపట్టలేదని, తండాల్లోని ప్రజల ఇబ్బందులు చూడడానికి రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సీతరాంరెడ్డి మృతి తీరని లోటు


సీతరాంరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వరప్రసాద్‌రెడ్డి, తదితరులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని గణపవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవరపల్లి సీతరాంరెడ్డి (72) మంగళవారం వడదెబ్బకు గురై మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతరాంరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు జాబిశెట్టి ప్రసాద్, ఇర్ల నారపరెడ్డి, చిట్టా రాంరెడ్డి, లక్ష్మమ్మ, వరాలరెడ్డి, గోపిరెడ్డి, బండికోటయ్య, సత్య తదితరులు ఉన్నారు.